ఓటరు నమోదు జాగ్రత్తగా చేపట్టండి : ఎమ్మెల్యే


కలెక్టర్‌ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మల్కాజిగిరి: ఓటరు నమోదు జాగ్రత్తగా చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన పలు సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్‌ ఎన్నికలు జరిగేలోపు కొంతమంది పేర్లు జాబితాలో లేకపోవడం సరికాదన్నారు. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లందరినీ ఒకే పోలింగ్‌బూత్‌లో ఉండేలా చూడాలని, గతంలో అలా లేకపోవడం వల్ల చాలామంది ఓటుహక్కును వినియోగించుకోలేదన్నారు. ఒకే ఇంట్లో ఏళ్ల తరబడి ఉంటున్నా.. వారి ఓట్లు గల్లంతు కావడం ఎవరి వైఫల్యమో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత గల విద్యార్థులంతా ఓటుహక్కును పొందేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఓటరు నమోదులో పాల్గొనే సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడానికి కూడా కాలయాపన చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, సకాలంలో వారికి వేతనం అందజేయాలన్నారు.

సర్వే ప్రారంభం..
ఆల్వాల్‌: ఆల్వాల్‌ డివిజన్‌ వెంకటాపురంలో సమగ్ర సర్వేను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాసరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వంపై సర్వేలకు పరిమితం కాకుండా ప్రజలకు మేలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. మదన్‌మోహన్‌, కృష్ణారెడ్డి, చరణ్‌, గిరి, సురేందర్‌రెడ్డి, సునీత, కృష్ణారెడ్డి, పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వెంకటాపురంలో సర్వేను ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

స్వచ్ఛందంగా వివరాలు వెల్లడించాలి

ఉప్పల్‌లో కొనసాగుతున్న సమగ్ర సర్వే

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతోంది. గురువారం ఉప్పల్‌ సర్కిల్‌ డీసీ అంజనేయులు, ఉప్పల్‌ కార్పొరేటర్‌ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి భరత్‌నగర్‌లో పర్యటించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే వివరాలను సేకరించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను వెల్లడించి ప్రభుత్వ అధికారులతో సహకరించాలని కోరారు. మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, జగన్నాథ్‌గౌడ్‌, రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, దేవిరెడ్డి అనిల్‌కుమార్‌, లుకాస్‌ తదితరులు పాల్గొన్నారు.


సర్వేలో డీసీ అంజనేయులు, కార్పొరేటర్‌ రజితాపరమేశ్వర్‌రెడ్డి

రూ.56 లక్షలతో అభివృద్ధి పనులు


డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో మేయర్‌ అజయ్‌యాదవ్‌

బోడుప్పల్‌: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. బోడుప్పల్‌లో గురువారం 21, 22 డివిజన్లలో రూ. 56లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు పనులు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని రకాల మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్లు భూక్యా సుమన్‌నాయక్‌, మహేశ్వరికృపాసాగర్‌ ముదిరాజ్‌, కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ బీ - బ్లాక్‌ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గ్రామకంతం భూమిని పరిరక్షించండి


కాప్రాలో వివాదంలో ఉన్న స్థలం

కాప్రా: కాప్రా ప్రభుత్వ స్కూల్‌ సమీపంలో ఉన్న గ్రామకంతం భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు స్థలంలో ఏళ్లనాటి నుంచి దసర ఉత్సవాల పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని, ఇప్పుడు దాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు చెబుతున్నారు. ఈ కబ్జాదారుల వెనుక రెవెన్యూ అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. గ్రామకంతం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి గ్రామకంతం భూమిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనదారుడి నిజాయితీ

పోగొట్టుకున్న బ్యాగ్‌ పోలీసులకు అప్పగింత

మల్లాపూర్‌: ఓ ద్విచక్రవాహనదారుడికి దొరికిన ల్యాప్‌టాప్‌లను నాచారం పోలీసులకు అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే చిలుకానగర్‌కు చెందిన సంతోష్‌ తార్నాక నుంచి నాచారం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో అతడి ఎదురుగా ప్రసన్న అనే మహిళ స్కూటీపై వెళ్తుంది. రెండు ల్యాప్‌టాప్‌లు ఉన్న బ్యాగ్‌ పడిపోగా.. గమనించకుండానే ఆమె ఇంటికి వెళ్లిపోయింది. సదరు మహిళ భర్త శ్రీనినాథ్‌తో కలిసి బ్యాగ్‌పోయిందని నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నాచారం స్నేహపురికాలనీ వద్ద పడి ఉన్న బ్యాగ్‌ను సంతోష్‌ తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌ కుమార్‌, అతడితో కలిసి బ్యాగును అందజేశారు. నిజాయితిని చాటుకున్న వ్యక్తిని ఇన్‌స్పెక్టర్‌ అభినందించారు.


ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌కుమార్‌

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

మౌలాలి: బిహార్‌ ప్రాంతవాసులు నిర్వహించే ఛట్‌పూజలో వినాయక్‌నగర్‌ డివిజన్‌ బండ చెరువులోని బేబిపాండ్‌ వద్ద సూర్యభగవానుడి పూజలో కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


బండ చెరువు వద్ద కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి


చర్లపల్లి చెరువు వద్ద ఛట్‌ పూజలో కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి


రామంతాపూర్‌లో ఛట్‌ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఛట్‌ పూజా మహోత్సవం

- సూర్యభగవానుడికి విశేష పూజలు
- 6 రోజుల పాటు అంకురార్పణ

కుషాయిగూడ: ఉత్తర భారతీయుల పవిత్ర ఛట్‌ పుజమహోత్సవం చర్లపల్లిలో ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవం మూడ్రోజుల పాటు జరగనుంది. ఉత్తర, తూర్పు రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడే స్థిరపడిన వారంతా ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నారు. కార్తీకమాసం ఆరోరోజు ఈ ఉత్సవానికి అంకురార్పన చేసి మూడ్రోజుల పాటు జరుపుకోవడం ఆనవాయితి. ఈ సందర్భంగా సూర్యోదయం, సూర్యాస్థమయంలో చెరువు వద్ద సూర్య భగవానుడు, అతడి సోదరి ఛతి మైయాను ఆరాధించి మొక్కులు చెల్లించుకుంటారు. చర్లపల్లి చెరువు వద్ద జరిగిన ఈ ఉత్సవంలో కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవితో పాటు పలువురు స్థానికనేతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తజనసంద్రమైన ఉప్పల్‌ బేబి ఫాండ్‌..
ఉప్పల్‌: సూర్యభగవానున్ని కొలిచే ఇండో- నేపాలీస్‌, బిహార్‌, జార్ఖండ్‌, తూర్పు ఉత్తరప్రదేశ్‌ ప్రాంతాలవాసులు ఛట్‌ పూజను ఘనంగా నిర్వహించుకున్నారు. బీహారి అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం ఉప్పల్‌ నల్లచెరువు బేబిఫాండ్‌సహా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఈ పండగ విస్తరించింది.

కుటుంబం ఆరోగ్యంగా ఉండాలి..
కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ భగవంతున్ని ప్రార్థించేది ఛట్‌ పూజ అని బిహారి అసోసియేషన్‌ ప్రతినిధులు ప్రభాస్‌ కుమార్‌, శేఖర్‌హౌజరీ, రవిశంకర్‌సింగ్‌, అరవిందసింగ్‌, విక్రమంసింగ్‌, దీలిప్‌లు తెలిపారు. బిహార్‌, జార్ఖండ్‌ ప్రజలు, చిన్న పెద్ద కలిసి ఉప్పల్‌ నల్ల చెరువు వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వెదురు బుట్టలు, చెరుకు గడలతో వచ్చి మట్టిదీపాలు వెలిగిస్తారు.


ఉప్పల్‌ బేబి ఫాండ్‌ వద్ద..

పర్యావరణానికి అనుకూలం..
సహజ పదార్థాలు, పర్యావరణానికి అనుకూలంగా ఉండే వాటిని మాత్రమే ఈ పూజల్లో ఉపయోగించడం విశేషం. ప్రతి ఏటా కార్తీకమాసంలో జరిపే ఛట్‌ పూజ ప్రాచీన పండుగల్లో ఒకటి కావడం విశేషం.

రామంతాపూర్‌: సరస్వతి పూజ సమితి ఆధ్వర్యంలో రామంతాపూర్‌ చిన్న చెరువు ప్రాంగణంలో గురువారం సాయంత్రం వందలాది మహిళలు ఛట్‌ పూజ నిర్వహించారు. సమితి ప్రతినిధులు సురేష్‌సింగ్‌, రాంప్రకాష్‌ గుప్తా, సునీల్‌సింగ్‌, కమలేష్‌, పాండే భగవాన్‌సింగ్‌, అజయ్‌శర్మ, మంజునాథ్‌ గుప్తా, ధర్మేందర్‌, రాజీవ్‌కుమార్‌, సంతోష్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో బిహారీ అసోసియేషన్‌ ప్రతినిధులు

నేడు మెగా రక్తదాన శిబిరం

మేడిపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆర్‌వీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో జంట కార్పొరేషన్ల పరిధిలో నగర కాంగ్రెస్‌పార్టీ, రెడ్‌క్రాస్‌ సంస్థ సహకారంతో మేడిపల్లి వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెగా రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. జంట కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బోడుప్పల్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పీర్జాదీగూడ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు, ఆర్‌వీ ఫౌండేషన్‌ చైర్మన్‌ తుంగతుర్తి రవి కోరారు.

కబడ్డీలో విద్యార్థిని ప్రతిభ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మృదుల

ఆల్వాల్‌: తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్‌ - 14 కబడ్డీ పోటీలకు జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని మృదుల ఎంపికై ంది. నల్గొండ జిల్లా మాదాపూర్‌లో పోటీలు జరుగుతాయని ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయురాలు పారిజాత తెలిపారు.

హుండీ లెక్కింపు

ఆల్వాల్‌: ఆల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు గురువారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. హుండీ లెక్కింపు ద్వారా రూ. 3,64,619 ఆదాయం వచ్చిందని ఈవో వీరేశం తెలిపారు. ఆలయ చైర్మన్‌ రాజా సంజయ్‌గోపాల్‌, వెంకట్‌రామిరెడ్డి, రామచందర్‌రావు, శివరామకృష్ణ, వెంకట్‌ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


రాము

మల్కాజిగిరి: వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. పీవీఎన్‌ కాలనీకి చెందిన శ్రీరాల రాము (51) ఇంటీరియర్‌ డిజైనర్‌. కాగా ఈనెల 6న ఉదయం ఇంట్లో టిఫిన్‌ చేసిన అనంతరం బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మధ్యాహ్నం భార్యకు పిల్లలతో ఉన్న వీడియోలు పోస్ట్‌ చేసి కొంతమంది తనను మోసం చేశారని మెసేజ్‌ పంపించి ఫోన్‌ స్విచ్చాఫ్‌ చేశాడు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిశీలన

ఆల్వాల్‌: ఆల్వాల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాసరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రఘునాథ్‌స్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ శోభారాణి పరిశీలించా రు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఈనెల 18న ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తుందని, ఈ లోగా పనులు పూర్తిచేయాలని సూచించామన్నారు. డాక్టర్‌ యాకందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాసరెడ్డి

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

రామంతాపూర్‌: విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు భరత్‌ నగర్‌ ఓల్డ్‌ రామంతాపూర్‌, శ్రీనగర్‌కాలనీ, శాంతినగర్‌, గాంధీనగర్‌, రాజేంద్రనగర్‌, ఆనంద్‌నగర్‌లలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని ఏఈ రాములు కోరారు.

బోడుప్పల్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా బోడుప్పల్‌లోని 11కేవీ ఉదయ్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో పలు కాలనీల్లో శుక్రవారం విద్యుత్‌ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈస్ట్‌ బృందావన్‌, వెస్ట్‌ బృందావన్‌ కాలనీ, శ్రీనివాస్‌కాలనీ, సత్తిరెడ్డి కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

కాప్రా: విద్యుత్‌ మరమ్మతులు, విద్యుత్‌ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో సైనిక్‌పురి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం పలు కాలనీలకు విద్యుత్‌ సరఫరా నిలిచిపోనున్నట్లు ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఎల్లారెడ్డిగూడ, ఎస్‌ఎస్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని కాప్రా మెయిన్‌రోడ్డు, వినాయక్‌నగర్‌రోడ్డు నెంబర్‌ 1,2,3 శ్రీసాయినగర్‌, హనుమాన్‌నగర్‌, గోల్డెన్‌గేట్‌, ఆర్టీసీకాలనీ, మల్లికార్జుననగర్‌, సీఎస్‌నగర్‌, ఎన్‌ఆర్‌ఐ కాలనీలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

అరోరాలో యూనివర్సిటీలో హెల్త్‌క్యాంప్‌

మేడిపల్లి: అరోరా యూనివర్సిటీలో సాయి సంతోషి చారిటబుల్‌ ట్రస్ట్‌, యూనివర్సిటీ ఎంగేజ్‌మెంట్‌సెల్‌ సంయుక్తంగా గురువారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం దంత, కంటి, వినికిడి పరీక్షలను నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ శ్రీలత మాట్లాడుతూ... రోజువారి జీవితంలో తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోవడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కన్వీనర్‌ చంద్రశేఖర్‌, డాక్టర్‌ రాకేష్‌చంద్ర, డాక్టర్‌ గాయత్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్‌ డాక్టర్‌ శ్రీలత

తవ్వారు.. వదిలేశారు

రామంతాపూర్‌: శ్రీనగర్‌ కాలనీ అంతర్గత ప్రధాన రహదారిపై జలమండలి అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పైపులైన్‌ పనుల నిమిత్తం జలమండలి సిబ్బంది రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో గురువారం స్థానిక ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ సభ్యులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ రోడ్డుపై రోజుకు కొన్ని వేల వాహనాలు వస్తుంటాయని, ఈ సమస్య అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించడం లేదని వారు వాపోయారు. పనులు పూర్తి చేయకపోతే జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రజావాణి ప్రతినిధులు ఎర్రం శ్రీనివాస్‌, సత్యనారాయణ, వినోద్‌, అనిల్‌, మాధవ, శ్రీను, చంద్రకాంత్‌, గోపాల్‌, రామకృష్ణ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



నాచారంలో ఎమ్మెల్యే పర్యటన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్‌: నాచారం డివిజన్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి గురువారం పర్యటించారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించిన ఆయన వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. జలమండలి డీజీఎం సతీష్‌, అధికారులు, బీఆర్‌ఎస్‌ నేతలు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కుషాయిగూడ: సోనియాగాంధీనగర్‌-2 కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవిని కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దశలవారీగా సమస్యల పరిష్కరిస్తానని కృషి చేస్తానన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడతానని చెప్పారు. మేడ్చల్‌ ఏఎంసీ డైరెక్టర్‌ నాగిళ్ల బాల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కనకయ్య, శివకుమార్‌, బాలకృష్ణ, నరేష్‌, బాలరాజు, సంపత్‌, ఉపేందర్‌ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు ఆర్థికసాయం


సాయం అందజేస్తున్న నాయకులు

రామంతాపూర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌ నేత గంధం నాగేశ్వర్‌రావు పుట్టినరోజు సందర్భంగా గురువారం రామంతాపూర్‌లోని వివిధ బస్తీల్లో అనారోగ్యం, ఆపదలో ఉన్న బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు శ్రీరామ్‌, విజయ్‌, స్వరూప, ప్రకాష్‌లకు ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని పేద బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. బీఆర్‌ఎస్‌ నేతలు శ్రీకాంత్‌గౌడ్‌, శంకర్‌, నర్సింగ్‌రావు, మధుసూదన్‌రెడ్డి, చాంద్‌పాషా, సాయి, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న రమేష్‌యాదవ్‌

బోడుప్పల్‌: శ్రీసాయి భవానీనగర్‌ కాలనీలోని స్ఫటిక లింగేశ్వరసహిత సీతారామాంజనేయ దేవాలయంలో గురువారం కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జడిగె మంజుల రమేష్‌యాదవ్‌ మాట్లాడుతూ.. కార్తీకమాసం అత్యంత పవిత్రమైందని, శివకేశవులను పూజిస్తే అన్ని శుభాలు కలుగుతాయన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

రామంతాపూర్‌ : గ్రీన్‌హిల్స్‌ కాలనీ హబ్సిగూడ వద్ద 600 ఎంఎం డయా ఔట్లెట్‌ నీటి సరఫరా లైన్‌లో భారీ లీకేజీ మరమ్మతుల కారణంగా రామంతాపూర్‌ ప్రాంతానికి శుక్రవారం తాగునీటి సరఫరా ఉండదని జలమండలి మేనేజర్‌ రవీందర్‌గౌడ్‌ ప్రకటించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వ్యర్థాల తొలగింపుపై చర్యలేవి ?


సర్కిల్‌ కార్యాలయం సమీపంలో..

మల్కాజిగిరి: సర్కిల్‌ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారి పక్కన చెత్త పేరుకుపోయినా సంబంధిత సిబ్బంది తొలగించలేదు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త, చెదారం వేయకూడదని అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మారుతీనగర్‌లో ఉదయం 11 గంటల వరకు కూడా చెత్త తొలగించలేదని ప్రజలు చెబుతున్నారు.